క్లుప్తంగా

నియామకం


రమేశ్‌రెడ్డి, అధ్యక్షుడు


చంద్రమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్

ములుగు: ములుగు మండల బీఆర్‌ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ సమితి, తాత్కాలిక మండల అధ్యక్షుడిగా దేవగిరిపట్నం గ్రామానికి చెందిన సానికొమ్ము రమేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అబ్బాపూర్ గ్రామానికి చెందిన ఆకుతోట చంద్రమౌళిని నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి శనివారం పేర్కొన్నారు. ప్రస్తుతం మండల అధ్యక్షుడిగా ఉన్న పాలెపు శ్రీనివాస్‌ను నూతన మల్లంపల్లి మండల ఎన్నికల సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగించనున్నట్లు తెలిపారు.

ఐటీడీఏ మలుపు వద్ద దిగబడిన లారీ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ మలుపు వద్ద భారీ వాహనం శనివారం దిగబడింది. దీంతో వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై తాజొద్దీన్ స్పందించి వాహనాన్ని తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. రెండు రోజుల క్రితం రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చగా మళ్లీ ఏర్పడ్డాయి.

ప్రశంస పత్రాల అందజేత



వాజేడు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వాజేడుకు చెందిన కావిరి బాల చంద్రమూర్తి, దేవ కుమారికి ఉత్తమ బూత్ లెవెల్ ఆఫీసర్లుగా, ఉత్తమ ఎలక్షన్ సూపర్ వైజర్‌గా కుందమల్ల నాగరాజులకు శనివారం ప్రశంస పత్రాలను అందించారు. తెలంగాణ చీఫ్ ఎన్నికల అధికారి నుంచి ప్రశంస పత్రాలు రాగా తహసీల్దార్ శ్రీనివాస్ అందించారు.

పరామర్శ



గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగిరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పరామర్శించారు. కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పులుగుజ్జు వెంకన్న, చింత క్రాంతి, లింగా రెడ్డి, యాదగిరి రెడ్డి, జక్కు రణదీప్, గొంది కిరణ్, దేవరపెల్లి మల్లారెడ్డి, సామ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్‌ఓగా శ్వేత

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ శ్వేత ఉత్తమ బీఎల్‌ఓగా ఎంపికైయ్యారు. శనివారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



శాయంపేట : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సీఐ రంజిత్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భమాయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క వాహనదారుడు వేగంగా వెళ్లకుండా హెల్మెట్ ధరించి నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. డ్రంకెన్‌డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌కు ఆస్కారం లేదని అన్నారు. ఫోర్‌వీలర్స్ వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై పరమేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు దక్కేనా?

ప్రభుత్వ భూమిలో వెలసిన 879 గుడిసెలు

- 17 నెలలుగా గుడిసెల్లోనే నివాసం
- రహదారి, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కోసం వినతి


ప్రభుత్వ భూమిలో వేసిన గుడిసెలు

వాజేడు: గోదావరి వరదల సమయంలో ముంపునకు గురికావడం, ఇంటి జాగలేని నిరుపేదలు తమకు ఇంటి స్థలం కావాలని కోరుతూ.. మండల పరిధిలోని వాజేడు, పూసూరు గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలను వేశారు. 2023 సెప్టెంబర్ 11న సీపీఎం, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నిరుపేదలు గుడిసెలను వేసుకున్నారు. ఉన్న ఊరును వదిలి వచ్చి గుడిసెలను వేసుకుని నివాసం ఉంటున్నారు. గోదావరి ముంపు బాధితులు, ఉమ్మడి కుటుంబంలో ఉంటున్న వారు ప్రభుత్వ పరంగా ఇంటి స్థలం కావాలని కోరుతున్నారు.

879 గుడిసెలు

మండలంలోని 37 గ్రామాల నుంచి 879 కుటుంబాల వారు గుడిసెలను వేసుకున్నారు. వీరంతా తమకు ఇంటి స్థలంపై హక్కు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో పాటు జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రాలను అందజేశారు. కాని నేటి వరకు వారికి ప్రభుత్వ పరంగా ఎలాంటి హక్కు పత్రాలు లభించలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాల కోసం గుడిసెవాసులు పోరాటం ప్రారంభించగానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. దీంతో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు ఇంటి స్థలాలు దక్కుతాయని ఆశాభావంతో ఉన్నారు.


పాయబాటలకు చెందిన నాగేశ్వరరావు కుటుంబం


దూలాపురానికి చెందిన నాగరాజు కుటుంబం

గుడిసెల్లోనే నివాసం

ఊర్లో సొంత ఇళ్లు లేకపోవడం, ఉన్నా ముంపు ప్రాంతంలో ఉండటం లాంటి కారణాలతో 17 నెలలుగా సుమారు 400 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వీరిని ఖాళీ చేసి వెళ్లాలని అధికారులు పలుమార్లు హెచ్చరించారు. కాని వారు తమకు ఇళ్లు లేవని ఇంటి స్థలాలు కావాలని ప్రభుత్వం ఆదుకోవాలని గుడిసె వాసులు వేడుకుంటున్నారు. ఏ సౌకర్యాలు లేకుండా జీవనం సాగిస్తున్నామని, తాగు నీటికోసం తోగు కాలువ వద్ద చెలిమెలను తీసుకొని నీటిని తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. తమ గుడిసెల కాలనీకి రహదారి, తాగు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతి ఇవ్వడంతో పాటు తమ నుంచి ఇంటి పన్నులు కట్టించుకుని రశీదులు ఇవ్వాలని కోరుతున్నారు.

నవాబుపేటలో వైభవంగా చండీయాగం

చిట్యాల: మండలంలోని నవాబుపేట శివాలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చండీయాగం, కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు రఘునందన్‌శర్మ వేద మంత్రోచ్చరణలతో ఆలయం మార్మోగింది. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ కసిరెడ్డి సాయిసుధారత్నాకర్, మాజీ ఎంపీటీసీ సర్వ విజయలక్ష్మి, జ్యోతి, రాణి, మాధవి, సంధ్య, శరత్‌కుమార్, నరేష్, రాజు పాల్గొన్నారు.


చండీయాగంలో పాల్గొన్న భక్తులు

మహాసభలకు తరలిన నాయకులు

భూపాలపల్లి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలకు జిల్లా ప్రతినిధులు శనివారం తరలి వెళ్లినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు తెలిపారు. ఈ నెల 28న వరకు నిర్వహించే మహాసభల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. నాయకులు రమేశ్, రాజేందర్, దేవేందర్, రాజయ్య, శ్రీకాంత్, ప్రీతి, పద్మ, చిన్న రాజేందర్ ఉన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకం

- మంగపేట తహసీల్దార్ రవీందర్


ములుగు : ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మంగపేట: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకమని తహసీల్దార్ తోట రవీందర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బొడ్రాయి సెంటర్ వరకు ఓటరు దినోత్సవ ర్యాలీని శనివారం నిర్వహించారు. ర్యాలీకి ముందుగా పాఠశాల విద్యార్థులకు ఓటు హక్కుపై తహసీల్దార్ అవగాహన కల్పించారు. అనంతరం బొడ్రాయి సెంటర్ వరకు ర్యాలనీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా పలువురు సీనియర్ సిటిజన్ ఓటర్లను శాలువాతో సత్కరించి సన్మానించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రోత్సాహకంగా ప్రశంస పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పొదెం మేనక, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్, ఏసుపాదం, బూత్‌లెవల్ అధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

యువకులు ఓటరు నమోదు చేసుకోవాలి

ములుగు: 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులు విధిగా ఓటరు నమోదు చేసుకోవాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం అన్నారు. కళాశాలలో 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలయ్య, అకాడమీ కో ఆర్డినేటర్ సీహెచ్ భాస్కర్, టీఎస్కేసీ కన్వీనర్ కవిత, స్టాఫ్ సెక్రటరీ సోమన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అమూల్యమైనది

ఏటూరునాగారం : ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ అమూల్యమైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రేణుక అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఎస్‌వీఈఈపీ విభాగం, రాజనీతి శాస్త్రం ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి రమేశ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధానంలో ఓటు హక్కు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఎస్‌వీఈఈపీ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త వెంకటయ్య, జ్యోతి, భాస్కర్, సుమలత, జీవవేణి, భావన, శేఖర్ పాల్గొన్నారు.


ఏటూరునాగారం : ఓటుకు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తున్న ప్రిన్సిపాల్ రేణుక


గోవిందరావుపేట : ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు రెవిన్యూ శాఖ అధికారులు

వాజేడులో ప్రదర్శన, మానవ హారం

వాజేడు: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, ఎంఈఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఓటు హక్కు విలువను తెలుపుతూ నినాదాలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఉద్యోగస్తులు మానవహారం నిర్వహించారు.

విద్యార్థులతో ర్యాలీ

వెంకటాపురం(కె): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభమై మండల కేంద్రంలో వేపచెట్టు సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు సాగింది. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఆర్ఐ మల్లయ్య,పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ములుగు రూరల్ : ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బండారుపల్లి మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సింగారం దేవకి అన్నారు. శనివారం మండలంలోని జీవింతరావుపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.


వాజేడు : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


ములుగు రూరల్ : అవగాహన ర్యాలీలో పాల్గొన్న మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు


మంగపేట : విద్యార్థినులకు ప్రశంసపత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ రవీందర్

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సమస్యలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

టేకుమట్ల: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ప్రజా సమస్యలు పేరుకుపోయాయని, బీఆర్‌ఎస్ నా యకుల అసత్య ప్రచారాలకు మండల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అనతి కాలంలోనే సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా కృషి చేస్తుందని అన్నారు. పదేళ్లలో రేషన్ కార్డుల కోసం మాట్లాడని నాయకులు ఇప్పుడు రేషన్ కార్డుల కోసం ప్రజల పక్షాన మాట్లాడడంపై ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వీరేశం, రమేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సతీశ్‌గౌడ్

గెలుపు కోసమే కాంగ్రెస్ ఎత్తుగడలు

- బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ

శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల జాబితా, గ్రామసభలకు తెరలేపిందని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులైన నిరుపేదల పేర్లు జాబితాలో రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలను తమ వైపు తిప్పుకోవాలనే కుట్రతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనం దేవరాజ్, కడారి చంద్రమౌళి, రాజేష్, రాజశేఖర్, శ్రీకాంత్, సుధాకర్, సుమన్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల బోర్లకు పర్మిషన్ ఇవ్వాలి

- రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి

గోవిందరావుపేట: రెవెన్యూ భూముల్లో రైతుల బోర్లకు పర్మిషన్ ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పస్రా ఫారెస్ట్ కార్యాలయం ఎదుట శనివారం రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకుడు తుమ్మల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 60 సంవత్సరాల నుంచి రైతులు రెవెన్యూ భూముల్లో కాస్తు కబ్జాలో ఉన్నారని అన్నారు. సర్వే నంబర్ 175లో 2200 ఎకరాలు, సర్వే నంబర్ 95లో 30 ఎకరాలు, సర్వే నంబర్ 41లో 183 ఎకరాలు రెవెన్యూ భూమి ఉందని అన్నారు. ఈ భూముల్లో ఏడో విడత భూ పంపిణీలో గతంలో ప్రభుత్వం అసైన్మెంట్ పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. అంతే కాకుండా సర్వే నంబర్ 175లో గత ప్రభుత్వం ఆధ్వర్యంలో ధరణి పట్టాలు వచ్చాయని అన్నారు. రైతులు పంటలు వేసుకొని గతంలోనే బోర్లు వేసుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఆ బోర్ల మరమ్మతు కోసం, కొత్త బోర్లు వేయడం కోసం రైతులు బోరు బండ్లను తీసుకుపోతే పస్రా ఫారెస్ట్ ఎఫ్ఆర్ఓ బోర్ వేయకుండా అడ్డం తిరిగి రైతులను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో మారపోయిన సారయ్య, పుప్పాల రాజన్న, గజ్జి ఎలేందర్, లకావత్ రాంచందర్, అంబాల మురళి, అన్నమయ్య, సల్లూరి రామకృష్ణ, బుర్రి వీరయ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రైతులు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు


ఐటీడీఏలో అతికిస్తున్న మూడు రంగుల పేపర్లు



ఏటూరునాగారం జీపీలో ప్లాస్టిక్ బాటిల్స్‌తో రాసిన హ్యాపి రిపబ్లిక్ డే

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను గణతంత్ర వేడుకలకు ముస్తాబు చేశారు. నేడు(ఆదివారం) గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏలో మూడు రంగుల జెండాలను భవనానికి అలంకరించారు. అలాగే గ్రామ పంచాయతీ వద్ద ప్లాస్టిక్ బాటిల్స్‌తో మూడు రంగులతో రిపబ్లిక్ డే 2025గా తీర్చిదిద్దారు. మండలంలోని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ముస్తాబు చేస్తుండడంతో పండుగ వాతావరణం నెలకొంది. అంతేకాకుండా ఐటీడీఏలో ప్రత్యేక సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

వెంకటాపురం(కె): కడుపునొప్పి భరించలేక వ్యక్తి అత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలోని వాడగూడెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన గుండారపు వెంకటేశ్వర్లు(46) కొంత కాలంగా అనారోగ్యంతో పాటు తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్నాడని తెలిపారు. కాగా వెంకటేశ్వర్లు భార్య అంజలి సైతం అనారోగ్య సమస్యలు ఏర్పడడంతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. దీంతో ఈ నెల 23న మండలకేంద్రంలోని తన కూతురు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. బెస్తగూడెం గ్రామ శివారుల్లోని రోడ్డు పక్కన ఉన్న అటవీ ప్రాంతంలో జీవితంపై విరక్తి చెంది ట్యాబ్లెట్లు వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు. వెంకటేశ్వర్లు అత్మహత్య చేసుకున్న సంఘటన స్థలాన్ని సిబ్బందితో కలిసి వెళ్లి వివరాలను సేకరించినట్లు ఎస్సై పేర్కొన్నారు.


వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రేగొండలో..

రేగొండ: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పెద్దంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దంపల్లి గ్రామానికి చెందిన బొద్దుల సదయ్య (60) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపంతో శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిపట్లు తెలిపారు. మృతుడి కూతురు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

యుద్ధభేరిని విజయవంతం చేయాలి


అభివాదం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

భూపాలపల్లి రూరల్: వరంగల్‌లో ఫిబ్రవరి 2న నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు బడుగు బలహీన వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం తీన్మార్ మల్లన్నటీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్ని బీసీ సంఘాల నాయకులతో కలిసి బీసీ రాజకీయ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరించారు. పలువురు బీసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్ వచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, ఇతర బీసీ సంఘాలు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, అఖిలేష్ యాదవ్ లాంటి పలు రాష్ట్రాల బీసీ నాయకులు కూడా యుద్ధబేరి సభకు వస్తున్నారని తెలిపారు. కావున జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున బీసీ ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

శాయంపేట : ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని బీఎస్‌ఎస్, దళిత సంఘాల నాయకులు దేవయ్య, క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు ఇందిరమ్మ రాజ్యంపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారని, ఇందిరమ్మ పేరుకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో అవకతవకలు జరుగకుండా చూడాలని అన్నారు. అర్హులకు అన్యాయం జరిగితే ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీఎస్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుమన్, జిల్లా నాయకులు విజయ్, రవీందర్, వరలక్ష్మి, పాపయ్య, అశోక్, సురేష్ పాల్గొన్నారు.